వైభవంగా జగన్నాథుడి రథయాత్ర



నిజాంపేట్‌లో రథయాత్రను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: ఇస్కాన్ ఆధ్వర్యంలో నిజాంపేట్‌లో పూరి జగన్నాథుడి రథయాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. సీతారామస్వామి ఆలయం నుంచి చేపట్టిన యాత్రకు ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై బంగారు, వెండి చీపురులతో రథం ముందు శుభ్రపరిచి యాత్రను ప్రారంభించారు. పుర వీధుల గుండా కొనసాగిన రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పంగ శ్రీనివాస్, వరగాని వాసు, ఫణి, రామచంద్రనాయక్, వర్మ రాజు, శ్రీను, ప్రశాంత్, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంటీ ఉద్యోగుల సేవలు మరువలేనివి

కుత్బుల్లాపూర్: దేశ ప్రగతిలో హెచ్‌ఎంటీ ఉద్యోగుల సేవలు ఎనలేనివని, ఏ రంగానికైనా హెవీ మిషనరీ టూల్స్ అందించిన ఘనత హెచ్‌ఎంటీ సంస్థకే దక్కుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. డీపోచంపల్లిలోని వేదిక గార్డెన్స్‌లో హెచ్‌ఎంటీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని డైరెక్టర్లను ఆదివారం సన్మానించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై సొసైటీ డైరెక్టర్లను సత్కరించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ భారీ యంత్రాలు తయారీ చేసి దేశాభివృద్ధిలో భాగస్వామ్యమైన సంస్థ డైరెక్టర్లను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంటీ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు రాజబాబు, ఉపాధ్యక్షుడు టీవీ సత్యనారాయణ, కోశాధికారి వికాస్, కార్యదర్శి ఓ. పండరి, డైరెక్టర్లు తులసీదాస్, శ్రీశైలం, అనంతరాములు, కళావతి, విజయలక్ష్మి, ఏ.శ్రీశైలం, కోఆప్షన్ సభ్యులు ఈ.శ్రీశైలం, జి. సత్యనారాయణ, ఆర్. మురళి, ఎం. మల్లేశ్ పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో వసతుల దిశగా..

- అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా సౌకర్యాల కల్పన
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొదటి దశలో 57 పాఠశాలల ఎంపిక
- రూ. 2.38 కోట్ల నిధుల కేటాయింపు
- చురుగ్గా సాగుతున్న పనులు



దుండిగల్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వేసిన టైల్స్



అదనపు తరగతి గది

దుండిగల్: నాసిరకం భోజనం.. సరిపడా లేని తరగతి గదులు, అంతంతమాత్రంగానే మరుగుదొడ్లు.. ఆరు బయటే చదువులు.. తాగేందుకు గుక్కెడు మంచినీరు లేక..పెచ్చులూడే తరగతి గదులు ఇది ఒకప్పటి ప్రభుత్వ పాఠశాల ల దుస్థితి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా మౌలిక వసతులు కల్పిస్తుండడంతో కార్పొరేట్‌కు దీటుగా రూపుదిద్దుకుంటున్నాయి.

నియోజకవర్గంలో మొత్తం 107 ప్రభుత్వ పాఠశాలలు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గండిమైసమ్మ దుండిగల్, కుత్బుల్లాపూర్, బాచుపల్లి మండలాల్లో మొత్తం 107 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 85 ప్రాథమిక, 21 ఉన్నత, ఒకటి ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి.

యేటేటా పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య..

ప్రభుత్వ పాఠశాలల్లో 2016–17లో 20,375 మంది విద్యార్థులు ఉండగా 2023–24లో 24,350కు చేరింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 1200 మందికి పైగా ప్రవేశాలు పొందగా విద్యార్థుల సంఖ్య 26,500 వేలకు పైగా చేరింది. గతంతో పోలిస్తే పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతూ వస్తుంది. 2014–15లో ఉత్తీర్ణత శాతం 34 ఉండగా 2023–24లో 73 శాతానికి చేరింది.

అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు..

ప్రతి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేశారు. ఆరు నుంచి పదో తరగతి వరకు ఒక్కో తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లుల చొప్పున మొత్తం 15 మందిని ఎన్నుకుంటారు. వారంతా డ్వాక్రా గ్రూపు సభ్యులై ఉండాలి. డ్వాక్రా గ్రూపు లీడర్‌ను ఈ కమిటీకి చైర్మన్‌గా నియమిస్తారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

రూ. 2.38 కోట్లతో అభివృద్ధి..

అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల అభివృద్ధితో పాటు మౌలిక వసతులు కల్పించనున్నారు. ప్రధానంగా ప్రతి తరగతి గదిలో నాలుగు ఫ్యాన్లు, నాలుగు లైట్లు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్మాణం , తరగతి గదిలో కరెంట్, పాఠశాల భవనాలకు రంగులు, ఇతర మరమ్మతులు చేస్తున్నారు. నియోజకవర్గంలోని 107 పాఠశాలలు ఉండగా మొదటి దఫాలో 57 పాఠశాలలు ఎంపిక చేశారు. అందులో 52 ప్రాథమిక, 5 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఎంపికైన స్కూళ్లలో రూ.2.38 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి.

పుస్తకాల పంపిణీ పూర్తి..

గతేడాది 24,350 మంది విద్యార్థులు ఉండగా వారిలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 12,848, ఉన్నత పాఠశాలల విద్యార్థులు 11,502 ఉన్నారు. ఈ ఏడాది 26,500 వరకు చేరే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు అంచనా వేశారు. ఇందుకు అనుగుణంగా రెండు విడతల్లో 1,36,765 పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఉచితంగా నోటు బుక్కులు అందజేశారు. అదేవిధంగా యూనిఫాంలు సైతం పంపిణీ చేశారు.



కొత్తగా ఏర్పాటు చేసిన నీటి కుళాయిలు



నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం..



ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ముఖ్యంగా ప్రతి గదిలో నాలుగు ఫ్యాన్లు, నాలుగు లైట్లు ఏర్పాటు చేశాం. అదేవిధంగా మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ వైరింగ్, తరగతి గది డోర్లు, కిటికీలకు మరమ్మతులు చేయించాం. విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుంది. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని తీసుకుంటున్నాం.

–వసంత కుమారి, మండల విద్యాధికారి

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

నిజాంపేట్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిజాంపేట్ కార్పొరేషన్ జర్నలిస్టుకాలనీ సంఘం నాయకులు ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో కమిటీ హాలు, పార్కు, ప్లేగ్రౌండ్‌తో పాటు చెర్ల ఎల్లమ్మ ఆలయం వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ గతంలో జర్నలిస్ట్ కాలనీలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేశామని మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కలిసిన వారిలో నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు బాలాజీ నాయక్, గాజుల సుజాత, జర్నలిస్టు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆస్కాని మారుతీసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య, కార్యవర్గ సభ్యులు జగదీశ్, వెంకట్, లింగస్వామి, సత్యనారాయణ, కృష్ణారావు, శ్రీనివాస్, మారుతి కుమార్, నరేంద్ర చారి, సుధాకర్ రెడ్డి, రాము యాదవ్, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా నిజాంపేట్ కార్పొరేషన్ జైదీపిక ఎస్టేట్స్‌లో జరిగిన జగన్నాథ రథయాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. యాత్రలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ కర్తూరి, కార్యదర్శి సతీశ్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

యాజమాన్య వైఖరిని నిరసిస్తూ ఆందోళన



ఆందోళన చేస్తున్న అపార్ట్‌మెంట్ యాజమాన్య ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని నాగార్జున డ్రీమ్ ల్యాండ్ అపార్ట్‌మెంట్ యాజమాన్య సంక్షేమ సంఘం ప్రతినిధులు యాజమాన్య వైఖరిని నిరసిస్తూ ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ నాగార్జున డ్రీమ్ హోమ్స్ కన్‌స్ట్రక్షన్స్ యజమాని నాగరాజు ఫ్లాట్ల విక్రయాల సమయంలో సూపర్‌మార్కెట్, వ్యాయామశాల, సెలూన్, ఈత కొలను, క్లబ్‌హౌస్ వంటి సదుపాయాలు కల్పిస్తామని చెప్పి ఏర్పాటు చేయడంలో మోసం చేశారన్నారు. అపార్ట్‌మెంట్ ఆవరణలో వాటి కోసం వదిలిన స్థలాలను ఖాళీగా ఉంచారని, ఇటీవల క్లబ్ హౌస్‌ని గోదాముగా వినియోగించేందుకు యత్నించారని సమస్యను పరిష్కరించాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా నాగరాజు సహకరించడం వాపోయారు. ఇప్పటికైనా సదుపాయాలు కల్పించే దిశగా కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం పని చేయాలని వారు డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

బంజారాహిల్స్: ఉస్మానియా యూనివర్శిటీ పరిధిలోని సైఫాబాద్ సైన్స్ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్‌లలో వివిధ సబ్జెక్టుల్లో బోధించేందుకు పార్ట్ టైం లెక్చరర్ (పీటీఎల్) ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీ (మూడు పోస్టులు), స్టాటిస్టిక్స్ (02), జువాలజీ (02), బయో టెక్నాలజీ (01), ఇంగ్లిష్ (02), తెలుగు (01), సంస్కృతం (01), డేటా సైన్స్ (02), ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ (01)లో బోధించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. యూజీసీ నిబంధనల మేరకు అభ్యర్థులకు పీజీలో 55 శాతం మార్కులు, ఎన్‌ఈటీ, ఎస్‌ఈటీ/ఎస్‌ఎల్‌ఈటీ అర్హత కలిగిన వారితో పాటు పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ లోగా ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాల్మీకులకు నిధులు కేటాయించి అండగా నిలవాలి

లిబర్టీ: ఆర్థికంగా చితికిపోయి దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్న వాల్మీకులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని వాల్మీకి సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డి.ప్రీతంసింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆ సంఘ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంప్రదాయ వృత్తిని జీవన భృతిగా మార్చుకుని అత్యంత దారిద్ర్య రేఖకు దిగువన జీవనం సాగిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో లక్షలాది మంది వాల్మీకులు జీవన ప్రమాణాలు మార్చేందుకు 2024–25 వార్షిక బడ్జెట్‌లో కనీసం వెయ్యి కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో వాల్మీకుల జీవన స్థితిగతులు మెరుగుపరిచి జీవన ప్రమాణాలను తీర్చిదిద్దాలని అందుకు కులస్తులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో డి.దిలీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అందని ద్రాక్షలా విద్య

పంజగుట్ట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల నిరుపేదలకు విద్య అందని ద్రాక్షలా మారిందని సామాజికవేత్త మాడిశెట్టి అరుణ్ కుమార్ అన్నారు. యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యూఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విద్యారంగ సమస్యల పరిష్కారంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు వంగూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అరుణ్‌కుమార్, ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్ రావుతో కలిసి మాట్లాడుతూ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ విద్య రోజురోజుకూ నిర్వీర్యం అవుతుందని, దీంతో పేద పిల్లలు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకైన కేంద్రం ఇప్పటి వరకు స్పందించ లేదని పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాని వెంటనే రాజీనామా చేయాలని, నేషనల్ టెస్ట్ ఏజెన్సీని వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యారంగంలో సమస్యల పరిష్కారం కోసం నిరంతరం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాదం తిరుపతి రావు, మాలోతు రాజేశ్ నాయక్, యూఎస్‌ఎఫ్‌ఐ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, ఏఐటీయూసీ నాయకుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా ఆరు గ్యారంటీల అమలు



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను కలిసి సమస్యలు విన్నవిస్తున్న సంక్షేమ సంఘాల ప్రతినిధులు



శ్రీశైలంగౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సంజయ్‌గాంధీనగర్ బీఆర్‌ఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్: దశలవారీగా ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీనారాయణ, విష్ణుగౌడ్, ఆంజనేయులుచారి, రాజలింగం తదితరులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కూన రఘుగౌడ్, నాయకుడు చౌడ శ్రీనివాస్, నాగిళ్ల శ్రీనివాస్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి, ఎస్‌సియూఐ నాయకులు గొల్ల జాన్, నవీన్, సతీశ్ ఉన్నారు. అదేవిధంగా స్థానికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంక్షేమ సంఘం నాయకులు శ్రీశైలంగౌడ్‌కు విన్నవించగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా వివిధ శుభకార్యాలకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.



హన్మంతరెడ్డి సమక్షంలో చేరిన బీఆర్‌ఎస్ మహిళా నాయకులు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

నిజాంపేట్: కాంగ్రెస్‌నే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో సూరారం డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ మాజీ వార్డు సభ్యులు అరుణ, శ్యామల మిత్రబృందం ఆయన సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, నాయకులు సంతోష్‌ముదిరాజ్, సురేందర్‌రెడ్డి, జగన్ ముదిరాజ్, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

జీడిమెట్ల డివిజన్‌లో పర్యటన

జగద్గిరిగుట్ట: మేడ్చల్ అర్బన్ బీజేపీ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి స్థానికులతో కలిసి జీడిమెట్ల డివిజన్ వెంకన్న హిల్స్ ఫేస్ 2 లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

చింతల్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లోని ఆయన నివాసంలో చింతల్ డివిజన్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ సదానందం ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బండి సంజయ్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. మామిడల శ్రీనివాస్, రాజ్కుమార్, పొన్నాల నరసింగ్ రావు, వంశీ ఉన్నారు.

పర్మనెంట్ చేయండి

పంజగుట్ట: తెలంగాణ మైనార్టీ విద్యాసంస్థల్లో కాంట్రాక్ట్ టీచర్లుగా పనిచేస్తున్న 31 మంది ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను పర్మనెంట్ చేయాలని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ టీచింగ్, నాన్ టీచింగ్, కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ యూనియన్ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ నాయకులు షమీమ్, సల్మా, జమీల్, తన్వీర్‌లు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 నుంచి 2003 సంవత్సరాలకు మధ్య అప్పటి రెసిడెన్షియల్ పాఠశాలల సొసైటీ కింద నియామకాలు జరిగాయన్నారు. మిగిలిన ఎస్సీ, ఎస్టీ, బీసీ సొసైటీలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను, సిబ్బందిని పర్మనెంట్ చేశారు కానీ తమను మాత్రం రెగ్యులర్ చెయ్యలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ఆదుకోవాలని విన్నవించారు.

కుత్బుల్లాపూర్ అభివృద్ధికి కృషి



ఆదిత్య హోమ్స్ కమ్యూటీ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సుచిత్రలోని ఆదిత్య హోమ్స్ కమ్యూనిటీ హాల్ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కరీంనగర్ జిల్లాలోని మానకొండూరు మండలం లక్ష్మీపూర్ గ్రామంలో కరెంటు తీగలు తగిలి గుడిసెలు కాలిపోయాయమని, అధికారులను పిలిచి వైర్లు ఎందుకు సరిచేయలేదని ప్రశ్నిస్తే తమ వద్ద నిధులు లేవన్నారని, రూ.10 వేల నిధులు వెచ్చించకపోవడంతో రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్రంలో ఇలాంటి వందలాది గ్రామాలున్నాయని, తాను ఆర్థిక మంత్రి ఉన్నప్పుడు రూ. 100 కోట్ల బడ్జెట్ కేటాయించి అవన్నీ పూర్తి చేయించానని గుర్తు చేశారు. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణనలో ఇప్పుడున్న పరిస్థితులు చూస్తే బాధనిపిస్తుందన్నారు. కాగా ఈటల రాజేందర్ వెళ్లిన అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ హాజరు కావడం గమనార్హం. కార్యక్రమంలో అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి సుధాకర్ రెడ్డి, జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి, ఉప్పల్ కమిషనర్ నరసింహ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కొరడా..!



ప్రైవేట్ బస్సు డ్రైవర్‌ను బ్రీత్ ఎనలైజ్‌తో పరీక్షిస్తున్న అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ ఉల్లంఘనులపై అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. జూలై 1న అల్వాల్ ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు చేపట్టిన నాగరాజు ఆధ్వర్యంలో సుచిత్ర, దూలపల్లి, గుండ్లపోచంపల్లి, అల్వాల్ వెళ్లే రోడ్డులో డ్రంకన్‌డ్రైవ్‌లు నిర్వహించారు. గడిచిన 15 రోజుల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 180 మందిపై కేసులు చేశారు. అదేవిధంగా రాంగ్ రూట్లో వచ్చి ప్రమాదాలకు కారణమైన 68 మందిపై కేసులు నమోదు చేశామని సీఐ నాగరాజు ‘సాక్షి’ కి తెలిపారు. అలాగే నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న 51 వాహనాలను సీజ్ చేసి చలాన్లు విధించినట్లు పేర్కొన్నారు.

అలాగే ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా నడపకుండా 4 యూనియన్ సభ్యులను ఏకం చేసి దూలపల్లి, సుచిత్ర, జీడిమెట్ల ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచనలు చేసినట్లు తెలిపారు. ఇటీవల ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్లను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పూజలు



పూజల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

జగద్గిరిగుట్ట: ప్రజలందరూ ఆయురారోగ్యాలు ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం జగద్గిరిగుట్ట, కూనా మహాలక్ష్మీనగర్‌లో రేణుకా ఎల్లమ్మ కల్యాణానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణతో పాటు వేణు యాదవ్, రుద్ర అశోక్, కమిటీ సభ్యులు వెంకటేశ్, లక్ష్మయ్య, మహంకాళి పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

కుత్బుల్లాపూర్: షాపూర్‌నగర్ ప్రభుత్వోన్నత పాఠశాల 2006–07 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ప్రధానోపాధ్యాయుడు లలితకుమార్, ఉపాధ్యాయులు కమలాకర్, త్రిమూర్తులు, భారతిని విద్యార్థులు సత్కరించారు. అనంతరం నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. యేటా సమ్మేళనం ద్వారా కలుస్తామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ముద్దాపురం మదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా మోడ్రన్ టాయిలెట్లు..!



నిరుపయోగంగా మోడ్రన్ షీ టాయిలెట్

చింతల్: జీహెచ్‌ఎంసీ పరిధిలోని కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఏర్పాటు చేసిన మోడ్రన్ షీ టాయిలెట్లు అలంకారప్రాయంగా మారాయి. ఒక్కోదానికి సుమారు రూ. 10 లక్షల నిధులు వెచ్చించి ప్రధాన చౌరస్తాల్లో ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు వాటి నిర్వహణను 15 ఏజెన్సీలకు అప్పగించగా వారు తూతూ మంత్రంగానే పనులు చేపట్టి చేతులెత్తేశారన్న ఆరోపణలు వచ్చాయి. చింతల్ లాస్ట్ బస్టాప్, గాజులరామారం చౌరస్తా తదితర ప్రాంతాల్లోని మోడ్రన్ షీ టాయిలెట్లు దొంగలు, మందుబాబులకు ఆవాసాలుగా మారినా పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు పేర్కొంటున్నారు.

ఎనీ టైం బ్యాగ్ మిషిన్లు సైతం అంతే..

స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రైవేట్ భాగస్వామ్యంతో సుమారు రూ. 8 లక్షల వ్యయంతో ఎనీ టైం బ్యాగు మెషిన్లను ఏర్పాటు చేశారు. అయితే వీటి నిర్వహణను కూడా పట్టించుకోకపోవడంతో అవి కూడా అలంకారప్రాయంగా మారాయి. బాలానగర్– ఐడీపీఎల్‌కు వెళ్లే దారిలో ఉషా కంపెనీ వద్ద మార్కెట్‌లో ఏర్పాటు చేశారు. ఈ మెషిన్‌లో రూ. 10 నోటు వేస్తే 20 కేజీల బరువు సామర్థ్యాన్ని మోసే బ్యాగు వస్తుంది. ఈ మిషను ఏర్పాటు చేసిన అధికారులు పక్కనే ఉండే మార్కెట్ యాజమానులకు ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించవద్దని హెచ్చరికలు చేయకపోవడంతో వారు షరా మామూలుగా ప్లాస్టిక్ కవర్లను ఉచితంగా ఇస్తుండడంతో ఈ బ్యాగులు తీసుకునే వారే కరువయ్యారు. దీంతో స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి తూట్లు పొడిచినట్లు అయిందని పలువురు పర్యావరణవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పేట్‌బషీరాబాద్‌లో పెరిగిన పిచ్చి మొక్కలు..



చింతల్ బస్టాప్ సమీపంలో ..



నిరుపయోగంగా ఎనీ టైం బ్యాగ్ మిషన్